అబల కాదు సబల

• నారీమణులు అభివృద్ధికి సారథులు • అన్ని రంగాల్లో 'రాణి'ంపు

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా.. యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః ఈ శ్లోకం అర్థం (ఎక్కడ మహిళలు గౌరవించబడతారో.. ఎక్కడ స్త్రీలను దేవతగా భావించి పూజిస్తారో అక్కడ సర్వసంపదలతో కూడిన లక్ష్మీదేవి అచంచలమై నిలబడుతుంది) సృష్టికి మూలం మహిళ... స్త్రీ లేనిది జననం లేదు. జీవం లేదు. ఆకాశం, అవనిలో సగమైన మహిళ నేడు సాంకేతిక, విద్య, వైద్య, విజ్ఞానం, రాజకీయం తదితర రంగాల్లో పైచేయి సాధించారనడంలో అతిశయోక్తి లేదు. సమాజంలో ముందుండి 'ఆడదంటే అబల కాదు సబల'అని నేటి మహిళ లోకం నిరూపించింది. ఈ నేపథ్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒడిదుడుకులను ఎదుర్కొని సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచి యువతులకు.. ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్న మహిళలపై ప్రత్యేక కథనం.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం



మహిళా దినోత్సవం ఎందుకు చేసుకుంటారో తెలుసా?

నల్లకుంట: మార్చి 8వ తేదీ ఒక చరిత్రాత్మక ప్రాధాన్యం గల రోజు. పది గంటల పని దినాల కోసం, పురుషులతో సమానమైన వేతనాల కోసం పశ్చిమ పెన్సిల్వేనియాలోని ఓ బట్టల మిల్లులో సమ్మె ప్రారంభమైంది. ఇందులో 5వేల మంది పాల్గొన్నారు. ఈ ఉద్యమం ఇతర ప్రాంతాలకు విస్తరించింది. చివరకు 1857 మార్చి 8న సమ్మె విజయవంతమైంది. అప్పటి నుంచి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నాం. చరిత్రను అనుసరించి సాధికారత సాధన దిశగా మహిళలు పోరాటానికి అంకురార్పన చేసిన రోజు ఇది. సృష్టిలో స్త్రీ, పురుషులిద్దరులకు సమాన స్థాయి కల్పించాలని వందేళ్ల క్రితమే నిర్ణయించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం ద్వారానే వారికి సమాజంలో సరైన స్థానం దొరుకుతుందని భావించారు. వందేళ్ల పోరాటం అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాం.

మహిళల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ



శాంతి భద్రతల పరిరక్షణతో పాటు మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాను. మహిళా దినోత్సవానికి ఒకరోజు ముందు కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉంది. కాచిగూడ పోలీస్‌స్టేషన్‌ను రాష్ట్రంలో ఆదర్శ ఠాణాగా పేరు తీసుకొస్తాను. మహిళలకు అవకాశం కల్పిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరూ పాల్పడినా సహించేది లేదు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలతో కలిసి చర్యలు తీసుకుంటా.

– కాచిగూడ ఇన్‌స్పెక్టర్ తల్లోజు జ్యోత్స్న

మహిళ అని వెనకడుగు వేయను..



ఎంతో క్రమశిక్షణతో చదివి శిక్షణ తీసుకుని 2020లో ఈ ఉద్యోగం సాధించాను. పురుషులతో సమానంగా కష్టపడి అన్ని డ్యూటీలను చేస్తున్నా. మహిళ అని వెనకడుగు వేయకుండా కర్తవ్య దీక్షతో బస్తీలు, కాలనీలలో గస్తీ నిర్వహిస్తుంటాను. పుష్ప–2 సినిమా రిలీజ్ సమయంలో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే.ఈ ఘటనలో తల్లి,కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. వారికి సీపీఆర్ చేశాను. తల్లి చనిపోగా కొడుకును కాపాడాగలిగాం. దానికి సీపీ సీవీఆనంద్ చేతుల మీదుగా మహిళ దినోత్సవం సందర్భంగా మహిళ సాధికారత అవార్డు అందుకుంది.

– మౌనిక, సబ్ఇన్‌స్పెక్టర్ చిక్కడపల్లి

పోలీస్ జాబ్ అంటే ఇష్టం..



ఎన్‌సీసీ విద్యార్థి కావడంతో క్రమశిక్షణ అలవాటు పడింది. పోలీస్ యూనిఫాం అంటే ఇష్టం. అందుకే పోలీస్ ఉద్యోగం సాధించాను. ఎబి సర్టిఫికేట్లు సాధించడంతో కర్తవ్య నిర్వహణాలో భాగంగా అంకితభావంతో పనిచేస్తున్నాను. చాలెంజ్‌గా తీసుకుని ఉద్యోగం చేస్తున్నాను. ఈ ఉద్యోగం సంతోషంగా చేస్తున్నాను. తండ్రి చనిపోవడంతో నా తల్లే నన్ను చదివించింది.

– విశ్వశాంతి, కానిస్టేబుల్

పోలీస్ కావడమే నా ధ్యేయం..



పోలీస్ కానిస్టేబుల్‌గా కావడమే నా ధ్యేయం. ఓయూలో ఎంఏ సోషియాలజీ చేశాను. చిక్కడపల్లి పీఎస్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం 2020లో సాధించాను. బందోబస్తులు, డ్యూటీలను సమర్థవంతంగా చేస్తున్నాను. తల్లి గృహిణి, తండ్రి ప్రవేట్ ఉద్యోగం చేస్తున్నాడు.

– జొహ్రా ఫాతిమా, కానిస్టేబుల్ చిక్కడపల్లి

మన చుట్టూ వివక్షే...



మహిళా దినం అంటే ఈ ఒక్క రోజు మాత్రమే కాదు. 365 రోజులు మహిళలవే. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయినప్పటికి వివక్షత అనేది కొనసాగుతూనే ఉంది. మొదట కుటుంబంలోనే అబ్బాయిని, అమ్మాయిని పెంచే విధానంలోనే తేడా కనిపిస్తుంది. మగ పిల్లలను ఒక రకమైన చదువుకు, ఆడపిల్లలను మరో రకమైన చదువుకు పరిమితం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో గతంలో కోఎడ్యుకేషన్ చదువులు ఉండేవి. కానీ నేడు తల్లిదండ్రులు గర్ల్స్ కాలేజీల్లో సపరేట్‌గా చదివిస్తుండడంతో ఎక్కడైనా అబ్బాయి పరిచయం అయినప్పుడు త్వరగా అట్రాక్షన్‌కు లోనవుతున్నారు. ప్రభుత్వాలు స్కూల్స్‌లో విద్యార్థినుల డ్రాపవుట్స్ లేకుండా చూస్తే బాగుంటుంది. ఇక మహిళలపై దాడులు, అత్యాచారాలు జరిగినప్పుడు శిక్షలు వెంటనే పడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. అప్పుడే మహిళలపై జరిగే దాడులు కొంత మేరకు అరికట్టవచ్చు. చట్టాలు ఎన్ని ఉన్నా వాటిని సక్రమంగా అమలు చేస్తేనే ఫలితం ఉంటుంది.

– సరోజారాయి, ఓల్డ్ డొమైన్ యూనివర్సిటీ

ఉమెన్స్ డే స్ఫూర్తి లేకుండా చేస్తున్నారు



మొదటిసారిగా 1911లో జర్మనీలోని కోపెన్ హగన్‌లో మార్చి 8ని అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా పాటించారు. మహిళలందరూ తమ హక్కుల కోసం, స్త్రీ, పురుష సమానత్వం కోసం, సమాన వేతనం చెల్లించాలని, శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని, 8 గంటల పనిదినం కోసం పోరాడిన రోజు మార్చి 8వ తేదీ. అప్పటి నుంచి గత 124 సంవత్సరాలుగా ఈ ప్రపంచ వ్యాప్తంగా పోరాట దినాన్ని జరుపుకుంటున్నారు. కానీ రాను రాను మార్చి 8 అంటే అందాల పోటీలు, మహిళల సన్మానాలు, స్త్రీల శరీరాలను అంగడి సరుకుగా మార్చి వేసి కాస్మోటిక్ వస్తువులను వాడేవాళ్లుగా అడ్వర్టైజ్‌మెంట్‌లు గుప్పిస్తున్నారు. సమానత్వం కోసం పోరాడాల్సిన స్ఫూర్తిని లేకుండా చేస్తున్నారు. ఇప్పటికైనా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా, ఉద్యోగ భద్రత కోసం, లింగ వివక్షత మార్పు కోసం ఈ మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించాలి. నాటి పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి.

– ఎస్‌ఎల్ పద్మ, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

తల్లే ప్రథమ గురువు



సమాజంలో పురుషుల కంటే ఎక్కువ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. తల్లే ప్రథమ గురువుగా కొడుకైనా.. కూతురైనా సమానత్వంతో భావిపౌరులుగా తీర్చిదిద్దాలి. బాలికలు చిన్నతనంలోనే గర్భందాల్చితే ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని అమాయక ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ హేమలత, జీహెచ్ఎంసీ సర్కిల్–16 ఏఎంహెచ్ఓ

భరోసా నింపాలి



చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు పిల్లలను ఆడ, మగ అన్న తేడా లేకుండా పెంచాలి. పాఠశాలల్లో బాలికలపై జరుగుతున్న ఘటనలకు వెంటనే **చర్యలు తీసుకొని** భరోసా కల్పిస్తున్నాం. బాలికలు **పాఠశాల నుంచే** మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని అవకాశాలను అందిపుచ్చుకొని **లక్ష్యం** చేరుకోవాలి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నేను **ఈ స్థాయికి వ**చ్చాను.

– డాక్టర్ జయలక్ష్మి, సీఎస్ ఆర్ఎంవో, ఫీవర్ ఆసుపత్రి

నా తల్లి వల్లే ఈ స్థాయికి..



మాది సంగీత కుటుంబం. చిన్న తనం నుంచి **మా అమ్మ, నాన్న** ఇద్దరు కూడా చదువుతో పాటు **సంగీతం నేర్చు**కోవాలని, మంచి స్థాయిలోకి **రావాలని చెబుతుం**డేవారు. ఆ ఆలోచనతోనే మా **కుటుంబంలో** నేను మా అక్క ఇద్దరం ఇంజినీరింగ్‌తో పాటు మా **అమ్మ నాన్నల** వద్ద సంగీతంలో శిక్షణ తీసుకున్నాం. ప్రభుత్వం నిర్వహించే సంగీతం పరీక్షలో ఉత్తీర్ణులయ్యాం. సంగీత కుటుంబంలో నుంచి వచ్చిన నేను ప్రస్తుతం మా తాత గారు స్థాపించిన సరస్వతి సంగీత విద్యాలయంలో సంగీత శిక్షకురాలిగా పనిచేయడం ఎంతో గర్వంగా ఉంది.

– యశస్విని, సంగీతం ఉపాధ్యాయురాలు

సత్ప్రవర్తనతోనే మార్పు...



మహిళా దినోత్సవం మహిళల హక్కులు, సమానత్వం, సాధికారతకు గుర్తింపుగా నిలుస్తోంది. స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం. పాశ్చాత్య సంస్కృతి మోజులో పడి స్త్రీల పట్ల అనుచితంగా ప్రవర్తించడం సరికాదు. భారతదేశ సంస్కృతి, సంప్రదాయం, నైతిక విలువలు, స్త్రీ విలువ, ప్రాధాన్యం చిన్నతనం నుంచే పిల్లలకు తెలియజేయాలి. అప్పుడే స్త్రీల పట్ల ఎలా నడుచుకోవాలి. ఏ విధంగా గౌరవించాలన్న విషయాలపై వారికి అవగాహన పెరుగుతుంది. మంచి నడవడికతోనే మహిళలపై హింసను ఆపవచ్చు.

– డాక్టర్ శివ జ్యోతి, డీడీసీఓపీ అసోసియేటివ్ ప్రొఫెసర్

తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలి



ముఖ్యంగా ఉన్నత చదువు పూర్తయిన తర్వాత ఇంటికి పరిమితం కాకుండా తగిన ఉద్యోగం చేసి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలి. అంతేకాదు తన కుటుంబానికి కూడా అండగా నిలవాలి. అన్ని బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలవాలి.

– డాక్టర్ వాసంతి, విశ్రాంత ప్రిన్సిపాల్

కఠిన చర్యలతోనే హింసను ఆపగలం



మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలున్నా పల్లె, పట్నం అనే తేడా లేకుండా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. నిర్భయ వంటి చట్టాలు తెచ్చినా ఎక్కడా దాడులు, హింస ఆగడంలేదు. దీనికి కారణాలు విశ్లేషించాలి. వ్యవస్థలోని లోపాలు సరిదిద్దాలి. బాధితుల పక్షాన కాకుండా నిందితులకు కొమ్ముకాసే అధికారులు, రాజకీయ నాయకులపై కఠిన చర్యలు చేపట్టాలి. అప్పుడే కొంత వరకు హింసను ఆపవచ్చు.

– నేహ నాగి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

మా శక్తి సామర్థ్యాలకు గుర్తింపు



సమాజంలో ఎవరైతే మహిళలను అణగారిన వారిగా చూశారో వారే నేటి సమాజంలో మహిళల శక్తి సామర్థ్యాలను గురించి తెలుసుకున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలకు సముచిత ప్రాధాన్యం లభిస్తోంది. ఉన్న సదుపాయాలను మహిళలు అందరూ అందిపుచ్చుకోవాలి. సమాజంలో మంచి గుర్తింపు పొందాలి. నా తల్లి సహకారంతోనే నేను ఈ స్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం నేను ఫార్మసీ రంగంలో ఉన్నందున పేద ప్రజలకు సేవ లందించేందుకు ఎంతగానో దోహదపడుతోంది.

– డి. జ్యోతి హనుమంతారావు, ఫార్మసిస్టు

ఆత్మ స్థైర్యం ముఖ్యం



గోల్నాక కార్పొరేటర్‌గా అభివృద్ధిలో నేను భాగస్వామ్యం అవడం సంతోషంగా ఉంది. మహిళలు ఉద్యోగులుగానే కాకుండా ప్రజాప్రతినిధులుగా రాణిస్తారని మాజీ ముఖ్యమంత్రి స్థానిక సంస్థలతో పాటు, నామినేటెడ్ పదవుల్లో సైతం 50 శాతం ఇచ్చి ప్రోత్సహించారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకం మహిళలకే అందిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో శ్రమిస్తే సాధించలేనిది లేదు. పెద్ద వారిని ఏ విధంగా గౌరవించాలనే ఆలోచనతో మహిళలకు ఉండాలి.

– దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్

గృహహింస సామాజిక సమస్యగా మారింది



భారతదేశంలో ప్రతి 9 నిమిషాలకు ఒక మహిళ గృహహింసకు గురవుతోంది. గృహహింస ఒక సామాజిక సమస్యగా మారింది. ఈ సమస్యను నాలుగు గోడల మధ్య బందీ చేయకుండా మహిళలు ధైర్యంగా బయటకు వచ్చి నిలదీయాలి. ప్రతి ఆడపిల్లకు స్వీయ రక్షణ చిన్నతనం నుంచే నేర్పడం చాలా ముఖ్యం. ప్రతి మహిళలకు విద్య, ఉద్యోగం, సాధాకారిత, సామాజిక బాధ్యత చాలా అవసరం. అప్పుడే స్త్రీ తన కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్లగలుగుతుంది.

– డాక్టర్ కె. పద్మజ, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని కేవీఎల్ఎన్‌నగర్ జెమిస్థాన్ పూర్, పుల్లయ్యబావి తదితర ప్రాంతాలలో ఉదయం 10.30 నుంచి 11గంటల వరకు.. గోల్కొండ క్రాస్‌రోడ్ ఫీడర్ పరిధిలోని చిలకలగూడ, శివాలయం, కృష్ణాకాలనీ, ఏక్‌మినార్ మసీదు తదితర ప్రాంతాలలో ఉదయం 11.30 నుంచి 12 వరకు.. అయ్యప్పటెంపుల్ ఫీడర్ పరిధిలోని బతుమక్మ కుంట, ఎరుకల బస్తీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, మల్లికార్జున్‌నగర్, సీతకాలనీ, శివంరోడ్, అయ్యప్ప టెంపుల్, సాయిబాబానగర్, అంబర్‌పేట్ తదితర ప్రాంతాలలో 2.30 నుంచి 3గంటల వరకు.. ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని రాఘవేంద్రస్వామి టెంపుల్, అంజయ్యక్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో 3.30 నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పీస్ కమిటీ సభ్యుల సేవలు ప్రశంసనీయం



కాచిగూడ: శాంతి భద్రతల పరిరక్షణలో పీస్ కమిటీ సభ్యుల సేవలు ప్రశంసనీయమని ఈస్ట్ జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి అన్నారు. అంబర్‌పేటలోని ఈస్ట్‌జోన్ కార్యాలయంలో శుక్రవారం సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అధ్యక్షుడు ఎస్.నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శరత్ శ్యామ్‌ల నేతృత్వంలో ప్రతినిధులు కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

బీరులో ఫంగస్, చెత్త

కవాడిగూడ: బీరులో ఫంగస్‌తో పాటు చెత్తాచెదారం రావడంతో ఓ వ్యక్తి షాక్‌కు గురయ్యాడు. ఇదేమిటని వైన్‌షాపు యజమానిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో కాసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరా పార్కు చౌరస్తాలో ఉన్న వాసు వైన్‌షాపు వద్ద జరిగింది. మద్యం దుకాణంపై చర్యలు తీసుకోవాలని సదరు వ్యక్తి డిమాండ్ చేశారు. ఈ విషయంపై ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని సమాధానం ఇచ్చారు.

మహిళల భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలి

ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం



కవాడిగూడ: సమాజ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం మరింత విస్తరించినప్పుడే సమాజం సంపూర్ణ అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం అన్నారు. శుక్రవారం దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులకు వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ఆయన ప్రదానం చేశారు. ఈ ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ... 1975లో మొట్ట మొదటిసారి ఐక్యరాజ్య సమితి సమాజ అభివృద్ధిలో మహిళల ఆవశ్యకతను గుర్తించిన తరువాతనే ప్రపంచ దేశాలు మహిళా దినోత్సవ వేడుకలు జరుపుతున్నాయని అన్నారు. గతంతో పోల్చుకుంటే మహిళల్లో సాధికారత, ఆత్మాభిమానం పెరిగాయని ఇది శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సంఘం ప్రధాన కార్యదర్శి ఎ. సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బి. శ్యామ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్‌దీపారెడ్డి, కన్వీనర్ ఉదయ్ సుజాత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాము, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, సంఘం నాయకులు ఎండి కృష్ణయాదవ్, దండూరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు చేయూతనివ్వాలి

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో అభివృద్ధి పనులకు చేయూతనివ్వాలని కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం ఇచ్చారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి డివిజన్‌లో పెండింగ్ పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను తెలిపారు. మొయిన్ చెరువు నాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తిరిగి ప్రారంభించారని కోరారు. వర్షకాలం వస్తే మల్లికార్జున నగర్, రాహత్‌నగర్‌లతో పాటు అంబర్‌పేట డివిజన్‌లో సమస్య తలెత్తుతోందన్నారు. అలాగే పలు కాలనీల్లో నిలిచిపోయిన పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి ఉన్నారు.



జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

యువతి అదృశ్యం



జమున(ఫైల్)

నల్లకుంట: బాబాయి ఇంట్లో ఆశ్రయం పొందుతున్న ఓ యువతి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్సై జే.శ్రీనివాస్ రావు తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్ కొమరి వెంకటన్న కుటుంబ సభ్యులతో కలిసి పాత నల్లకుంట డాక్టర్ చారీ లేన్‌లో నివాసముంటున్నాడు. కాగా ఆరు నెలలుగా అతని వదిన కుమార్తె పులిమామిడి జమున(19) ఉంటోంది. గత నెల 7న మధ్యాహ్న సమయంలో కుటుంబ సభ్యులను ఇంట్లో బంధించి బయట నుంచి తాళం వేసి ఎవరితో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. విషయం తెలుసుకున్న పి.వెంకన్న అన్ని చోట్ల వెతికినీ యువతి ఆచూకీ లభించలేదు. దీంతో వెంకన్న శుక్రవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రాంతంలో ఆటో డ్రైవర్...

నల్లకుంట: నకిరేకల్‌కు చెందిన పగిళ్ల జానీ(35) జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. ఆటో డ్రైవర్‌గా ఉపాధి పొందుతున్నారు. భార్య ఇద్దరు పిల్లలతో కలిసిన టీఆర్టీ కాలనీలో నివాసముంటున్నాడు. ఈనెల 6వ తేదీ ఉదయం స్కూల్ పిల్లలను వదిలేయడానికి వెళ్లిన జానీ ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భార్య శుక్రవారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధిస్తారు

సైబర్ క్రైమ్ మహిళా అధికారి వాణిప్రసాద్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్త్రీ శక్తిని ప్రపంచానికి చాటడమే అసలైన మహిళా దినోత్సవమని సైబర్ క్రైమ్ మహిళా అధికారి వాణిప్రసాద్ అన్నారు. శుక్రవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. మహిళలు తమ ఆటపాటలతో ఎంతగానో అలరించారు. అనంతరం వాణిప్రసాద్ మాట్లాడుతూ... మహిళలు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏమిలేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జమిలి సుజాత, రాష్ట్ర పతి అవార్డు గ్రహీత, క్రీడాకారిని స్వాతి, మహిళా విభాగం అధ్యక్షురాలు కె.ఎస్ సుఫల, కార్యదర్శి తులసీపద్మజ, కోశాధికారి రోహిణి, వైస్ ప్రసిడెంట్ జమిలి అనురాధ, వరద సుబ్బాలక్ష్మి, అరుణ, విజయలక్ష్మి, భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ అధ్యక్షులు టీఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శి తులసీ కృష్ణమూర్తి, కోశాధికారి వరదరాజయ్య, లక్ష్మణకుమార్, జెపి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని రాంనగర్ డివిజన్ అధ్యక్షులు గడ్డం సతీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ... బీజేపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని చెప్పడానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడమే అందుకు నిదర్శనమని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌ని ప్రజలు విశ్వసించలేదని ఇప్పుడు కాంగ్రెస్‌పైన ప్రజలకు పూర్తిగా నమ్మకం పోతోందన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, నాయకులు జైపాల్ రెడ్డి, కలకోటరుణ్, గడ్డం నవీన్, కుమార్, కిరణ్, జట్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌లింగంపల్లిలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గడ్డం సతీష్‌ను కలిసిన భరత్‌గౌడ్

మందకృష్ణ మౌనంతో ఒకశాతం రిజర్వేషన్ నష్టపోయాం

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

కాచిగూడ: తెలంగాణలో మాదిగలకు ఎంత శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చెప్పకుండా ఏ,బీ,సీ,డీ వర్గీకరణ జరగాలని మాదిగలకు అన్యాయం చేసి మంద కృష్ణ మాదిగ ఆంధ్రప్రదేశ్‌కు పారిపోయారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రావి ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మంత్రి మండలి ఆమోదం పొందినందుకు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 9శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మందకృష్ణ మాదిగ ఆంధ్రప్రదేశ్‌లో మాదిగలకు ఎంత శాతం రిజర్వేషన్ కావాలనే దానిపై ఒక స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో మంద కృష్ణ మౌనం వల్ల మాదిగ జాతి ఒక శాతం నష్ట పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మంద కృష్ణ, వర్గీకరణ వ్యతిరేక శక్తులు వర్గీకరణను అడ్డుకోవాలని ఎంత ప్రయత్నించినా మాదిగల పక్షపాతి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొక్కవోని దీక్షతో వర్గీకరణను అమలు చేశారన్నారు. మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ బిల్లు సాకారమైనందున మాదిగలు సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, మీసాల మల్లేశం, డాక్టర్ నరసింహులు, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్, వరలక్ష్మి, సాయిలు, నక్క మహేష్, జెర్రిపోతుల సాయన్న, శేఖర్, గుర్రం కోటేష్, దేవరకొండ నరేష్, జోకు గణేష్, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



బషీర్‌బాగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పిడమర్తి రవి తదితరులు

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

కాచిగూడ: స్థానిక సంస్థల, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో ప్రభుత్వం చిత్తశుద్ధితో 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పెంచిన రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరిగే వరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కులగణన విషయంలో ప్రభుత్వం ఇప్పటి వరకు సరైన విధానం అమలు చేయలేదని ఆరోపించారు. లోపభూయిష్టమైన విధానాలు అమలు చేయడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వివిధ సందర్భాల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 4కోట్లకు పైగా జనాభా ఉంటే, ప్రభుత్వం ఇటీవల చేపట్టిన జనగణనలో మాత్రం 3కోట్ల 55 లక్షల మంది ఉన్నట్లు మాత్రమే తేల్చారని ఆయన పేర్కొన్నారు.

◆ ప్రభుత్వం రీ–సర్వే కూడా సరిగ్గా చేపట్టకపోవడంతో కేవలం 15లక్షల మంది మాత్రమే తమ వివరాలు అందజేశామన్నారు. సర్వే శాస్త్రీయంగా నిర్వహించాల్సి ఉన్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఏమాత్రం అవగాహన లేని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ద్వారా, ఆన్‌లైన్ ద్వారా, టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కులగణన కుటుంబ సర్వే చేపడితే సర్వే ఫలితాలు తప్పుల తడకగా రాకపోతే ఇంకా ఏవిధంగా వస్తాయని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు పగడాల సుధాకర్, ఎల్.శ్రావణి, ఎల్.శ్రీకాంత్‌గౌడ్, నీల వెంకటేష్, కోల జనార్దన్, వేముల రామకృష్ణ, తంగెళ్లమూడి నందగోపాల్, మట్ట జయంతి, అనంతయ్య, ఉదయ్, ప్రణీత, సునిత, సి.రాజేందర్, పృథ్వీ, హరీష్, ప్రవీణ్, రాజ్ కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం

రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా శ్రావణి

బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా ప్రధానకార్యదర్శిగా ఎల్.శ్రావణిని నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రావణి మాట్లాడుతూ... మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరుతూ ఈనెల 18,19 తేదీల్లో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



కాచిగూడ సమావేశంలో అభివాదం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీసీ నేతలు